క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ అభ్యంతరకరం



సమావేశంలో మాట్లాడుతున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రవీందర్

చండ్రుగొండ: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం అభ్యంతరకరమని, ఇది మాలలకు తీరని అన్యాయం చేయడమేనని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవిందర్ ఆక్షేపించారు. మండలకేంద్రం చండ్రుగొండలోని అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం జరిగిన మండల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధంగా జరగడం లేదన్నారు. షమీంఅక్తర్ ఏకసభ్య కమిషన్ సిఫార్సులను బహిరంగం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల రాజకీయ ఆధిపత్యం కోసం ఎస్సీలను బలి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు జరుగుతున్న అన్యాయంపై రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు దాసరి రామారావు, బదుగు శంకర్, రాయి రాజా, బేతి నాగబాబు, అల్లి నరేష్, వై.శేఖర్, కిషోర్, వంశీ, ప్రదీప్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం సమీపంలోని సరిహద్దు గ్రామమైన ఏపీలోని పాత గుండాల గ్రామంలో నిర్వహించే 23వ అష్టలక్ష్మి యాగం కరపత్రాలను పట్టణంలోని రాఘవ నిలయం (రెడ్డి సత్రం)లో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అష్టలక్ష్మి పీఠం వ్యవస్థపకాచార్యులు పీతాంబరం రఘునాథ చార్య స్వామి మాట్లాడుతూ.. మార్చి 12వ తేదీ నుంచి 23వ తేదీ వరకు లోక కల్యాణార్థం చేసే ఈ బృహత్తరమైన కార్యక్రమంలో కుటుంబ సమేతంగా వచ్చి ప్రతిరోజు పాల్గొనవలసిందిగా కోరారు. మహిళల కోసం సుమంగళి యాగం, కుంకుమార్చన అలాగే విద్యార్థుల కొరకు హయగ్రీవ యాగం, ప్రతిమలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గాదె మాధవరెడ్డి, నక్క భాస్కర రావు, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, బాలాజీ, అష్ట లక్ష్మీ వైభవ దీపిక సభ్యులు పాల్గొన్నారు.

మగ్గంవర్క్ శిక్షకురాలికి సన్మానం



శిక్షకురాలు రేణుకను సన్మానిస్తున్న మహిళలు

మణుగూరురూరల్: మండలంలోని పీవీకాలనీలో ఉన్న, సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం వర్క్ చేతి వృత్తుల శిక్షణ కేంద్రంలో శిక్షకురాలు కమటం రేణుకను శిక్షణ పొందిన మహిళలు ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా శిక్షకురాలు రేణుక మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సింగరేణి సంస్థ సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో చేతివృత్తుల శిక్షణ కేంద్రాల ద్వారా ప్రోత్సహిస్తుండడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రియాంక, కల్పన, అమీనా, గాయత్రి, భానుశ్రీ, జయశ్రీ, జయలక్ష్మి, విజయలక్ష్మి, లక్ష్మీప్రసన్న, శ్యామల, శాంతి, సాహితి, రజిత, మహిత, పుష్పలత, స్వర్ణలత, రాజేశ్వరి, మహేశ్వరి, శిరీష, దేవి, పద్మ, రమ్య, పావని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వితరణ



బాధిత కుటుంబాలకు ఇంటి సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన బాధిత కుటుంబాలకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన బాధిత కణితి నాగమణి, భూక్యా లక్ష్మయ్య, కనిగిరి వెంకన్న కుటుంబాలకు రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో వారికి నిత్యావసరాలు, ఇంటి సామగ్రితో పాటు నగదును అందచేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వం నుంచి సహాయసహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, మండల కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ, కుంజా శ్రీనివాసరావు,అన్నె సత్యనారాయణమూర్తి, వెంకటరెడ్డి, కోడిచంటి, యంబడి అర్జున్ పాల్గొన్నారు.

బతుకుదెరువుకు వలసబాట

- భారీగా తరలివస్తున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు
- మిర్చికోత పనులకు మొగ్గు
- తక్కువ కూలి చెల్లిస్తున్న దళారులు



చర్ల బస్టాండ్‌కు చేరుకున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ కూలీలు

చర్ల: బతుకుదెరువు కోసం సరిహద్దు ఆదివాసీలు తెలంగాణాలోకి భారీగా వలసొస్తున్నారు. ప్రస్తుతం ఆదివాసీ పల్లెల్లో ఎటువంటి పనులు లేకపోవడంతో అక్కడి ఆదివాసీలు తెలంగాణాలో ప్రారంభమయిన మిర్చి కోతల పనులకు వలసబాట పట్టారు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు నాలుగు నెలల పాటు కొనసాగే మిర్చి కోతల పనుల కోసం ఆదివాసీల వృద్ధులు, మహిళలు, పిల్లలతో కలిసి వలసొస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసులు ఇక్కడ మూడు, నాలుగు నెలల పాటు కొనసాగే మిర్చి కోత పనులు చేసుకుని వచ్చే డబ్బుతో వారికి వర్షాకాలం మొత్తానికి అవసరమయ్యే బియ్యం, నూకలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని తీసుకువెళ్తారు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి మిర్చి కోత కూలీ పనుల కోసం భారీగా వస్తున్నారు.

వేల సంఖ్యలో వలసలు

ప్రతి సంవత్సరం వలసలు సహజంగా కనిపిస్తున్నప్పటికీ.. గతం కంటే ఈ ఏడాది వలస వస్తున్న వారి సంఖ్య పెరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం ఎటువంటి పనులు లేకపోవడం, అక్కడి పోలీసుల కూంబింగ్ ఆపరేషన్లు కొనసాగుతుండడం వంటి పరిస్థితుల నేపథ్యంలో వలసలు పెరిగాయి. దగ్గర దగ్గర ప్రతిఏటా మూడు నుంచి నాలుగు వేల మంది వరకు తెలంగాణకు వస్తుండగా.. ఈ ఏడాది మరో వెయ్యి నుంచి పదిహేను వందల మంది వరకు కూలీలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో అక్కడి పల్లెలు బోసిపోయాయి. నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

దళారుల శ్రమ దోపిడీ..

బతుకుదెరువు కోసం వలసొస్తున్న ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు దళారీలు.. ఆదివాసీ కూలీల శ్రమను దోచుకునేందుకు యత్నిస్తున్నారు. పనుల కోసం తరలివస్తున్న ఆదివాసీలకు ఎదురేగి సరిహద్దు గ్రామాలకు చేరి కూలి ధర రూ.200 నుంచి రూ.250గా నిర్ణయిస్తున్నారు. ఆపై వారిని రైతులకు అప్పగిస్తున్నారు. వాస్తవంగా ఒక్కో మనిషికి సంబంధించి రైతుల వద్ద నుంచి రూ.500 నుంచి రూ.600 గుంజుతూ.. ఇక్కడ పని చేసే కూలీలకు రూ.350 నుంచి రూ.400 వరకు చెల్లిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వారికి మాత్రం రూ.200 నుంచి రూ.250 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ మేరకు దళారీలు రైతుల వద్ద కూడా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తోంది.

రూ.200కు ఏమొస్తాయి?



రెండొందల రూపాయలకు ఏమి వస్తాయి? పనులు లేక, పస్తులు ఉండలేక ఇక్కడకు కూలీ పనుల కోసం వస్తుంటే రెండొందలు ఇస్తామని అంటున్నారు. మిర్చి తోటల వద్దనే ఉంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేసే మాకు చాలీచాలని కూలీ ఇస్తామనడం సరికాదు. కూలీ కనీసం నాలుగు వందల రూపాయలైనా ఇస్తే బాగుండు.

– వంజం దేవా, ఉదతమల్ల

అవసరాన్ని ఆసరాగా చేసుకుంటే ఎలా?



అవసరాన్ని ఆసరాగా చేసుకోవడం సరైంది కాదు. పనులు లేక ఇక్కడికి వస్తుంటే బేరసారాలు ఆడడం, చాలీ చాలని కూలి డబ్బులు ఇస్తామనడం మంచిగ లేదు. మా ఆకలి బాధలను కూడా అర్థం చేసుకోవాలి. కనీసం నాలుగు వందలైనా కూలి ఇవ్వాలి.

– వెట్టి మంగి, తెట్టిమడుగు

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



కమటం వెంకన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం: మండల పరిధిలోని పలు కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం పాల్గొన్నారు. మల్లెలమడుగు గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు కమటం వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి ఆపరేషన్ అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండటంతో వారి నివాసంలో ఎమ్మెల్యేపరామర్శించారు. ప్రమాద, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. మొండికుంట గ్రామంలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆవుల రవి కుమార్తె సోనిప్రియ–సాయికుమార్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. గొందిగూడెం కొత్తూరులో మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ కుమార్తె ఓణీల అలంకరణ ఫంక్షన్‌లో ఎమ్మెల్యే పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఊసా అనిల్‌కుమార్, భద్రారెడ్డి, కొండబత్తుల ఉపేందర్, తూము వీరరాఘవులు, గుర్రం చెన్నయ్య, సామకూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

బూర్గంపాడు: ఏజెన్సీలోని పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యమందించేందుకు భద్రాచలంలోని నేతాజీ హాస్పిటల్ కృషి చేస్తుందని డాక్టర్ హేమంత్ కాకర్ల అన్నారు. మోరంపల్లిబంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నేతాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రధానోపాధ్యాయురాలు సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు వైద్యసేవలను అందించేందుకు భద్రాచలంలో ఆర్థోపెడిక్ లాప్రోస్కోపిక్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మోకాళ్ల మార్పిడి, కీళ్ల మార్పిడి, కీళ్లవాతానికి సంబంధించిన వైద్యసేవలను కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్నామన్నారు. ఈ వైద్యశిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. గుండెకు సంబంధించి ఈసీజీ పరీక్షలు, షుగర్ పరీక్షలు చేశారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం సుజాత, వైద్యులు, నిర్వాహకులు

కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నర్సింహారెడ్డి, సారెడ్డి దామోదర్‌రెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, సోము ఆదిరెడ్డి, చేతుల పెద్దరత్నం, ఏ.సీతారామిరెడ్డి, తమ్మినేని శ్రీనివాసరావు, మూల లక్ష్మీరెడ్డి, చేయూత ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'కొత్తపల్లి'



దుమ్ముగూడెం: కొత్తపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



బూర్గంపాడు: విన్నర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న చందునాయక్

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతులా గ్రామంలో నిర్వహిస్తున్న దబ్బనూతులా క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ పోటీలో కొత్తపల్లి జట్టు విజేతగా, రేసు 11 జట్టు రన్నర్‌గా నిలిచింది. ఆదివారం సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు విజేతలకు, రన్నర్‌లకు బహుమతి ప్రదానం చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపుకు నాంది అని అన్నారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ ఎండి.హలీంఖాన్, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, కుంజా శ్రీనివాసరావు, అన్నె సత్యనారయణమూర్తి, మోతుకూరి శ్రీకాంత్, టోర్నీ నిర్వహకుడు తోట రమేష్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

బూర్గంపాడు: ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేయాలని సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్ అన్నారు. సంత్ శ్రీసేవాలాల్ జయంతి సందర్భంగా ఆదివారం రాజీవ్‌నగర్‌లో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నీ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

గ్రామాలలో క్రీడామైదానాలను ఏర్పాటు చేసి, కోచ్‌లను నియమించాలన్నారు. గ్రామీణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. ఈ టోర్నీలో విన్నర్ జట్టు బూర్గంపాడు మణి ఎలెవన్ జట్టుకు రూ.20వేల నగదు, ట్రోఫీని, రన్నర్ జట్టు తాళ్లగొమ్మూరు ఎలెవన్ జట్టుకు రూ.12వేల నగదు బహుమతి, ట్రోఫీని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వహకులు గుగులోత్ రాంబాబు, నునావత్ నరేష్, చంద్రశేఖర్, రంజిత, ఏసు, రఘు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌–కో ఏఈ నరేశ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ములకలపల్లి టౌన్, పొగళ్లపల్లి, జగన్నాథపురం టౌన్‌ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రామయ్య నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం భక్తురాలు విరాళం అందజేశారు. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీకి చెందిన దత్త రెడ్డి రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు. ఆలయ సిబ్బంది సాయిబాబు తదతరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బాసట

ములకలపల్లి: విద్యుదాఘాతంతో మృతి చెందిన వెంకటమ్మ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బాసటగా నిలిచారు. సుబ్బనపల్లి గ్రామానికి చెందిన బండి వెంకటమ్మ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై అకాల మృత్యువాతపడిన విషయం విదితమే. ఈక్రమంలో ఆదివారం నిర్వహించిన వెంకటమ్మ దశదిన ఖర్మలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇతోదికంగా సాయమందించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్‌లు కారం సుధీర్, భూక్యా పత్తీలాల్, స్థానిక నాయకులు కుంజా రవి ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, నాయకులు నాగళ్ల వెంకటేశ్వరరావు, ఎండీ. అంజుం, గుర్రం కృష్ణమూర్తి ఆర్థిక సాయం అందజేశారు.

వరుడికి ఆశీర్వాదం

భద్రాచలంటౌన్: భద్రాచల పట్టణానికి చెందిన టీఎన్జీఓస్ జిల్లా మాజీ అధ్యక్షుడు చారుగుళ్ళ నాగేశ్వరరావు కుమారుడి వివాహ వేడుకకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వరుడుని ఆశీర్వదించి పెళ్లివారు ఏర్పాటు చేసిన తేనేటి విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ములకలపల్లి: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు కోసం ఈనెల 20న జరుప తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ములకలపల్లి సబ్‌డివిజన్ కార్యదర్శి కుంజా కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలపరిధిలోని గుట్టగూడెం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. హామీల అమలులో పాలకపక్షం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సబ్ డివిజన్ నాయకులు వంకా సురేశ్, వెంకటేశ్, చంద్రం, భాస్కర్, లక్ష్మి, సరోజ పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

ములకలపల్లి: మండల పరిధిలోని మూకమామిడిలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల, మండల సరిహద్దులోని పూసుకుంట శివారు వట్టివాగుపై హైలెవల్ వంతెన నిర్మాణాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎమ్మెల్యే.. పనుల పురోగతిని పరిశీలించారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, శనగపాటి అంజి, గాడి తిరుపతిరెడ్డి, ఎలకం వెంకటేశ్, పాలకుర్తి సుమిత్, వంజరపు ఉమేశ్, చవ్వా ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

కట్టమైసమ్మ జాతరలో ఎమ్మెల్యే

అశ్వారావుపేట: మండల పరిధిలోని నారాయణపురం కట్టమైసమ్మ తల్లి జాతర వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం పాల్గొన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. అనంతరం నారాయణపురం గ్రామానికి చెందిన జ్ఞానాల వెంకటేశ్వరరావు మనుమడు, మనుమరాలిని, కావడిగుండ్ల గ్రామానికి చెందిన షేక్ జలాలుద్దీన్ కుమారుడు, కుమార్తెను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ములకలపల్లి: పూసుకుంట శివారు వాగుపై వంతెన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే

భద్రాద్రి వాసికి లెక్చరర్ ఉద్యోగం



విజయ్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన మోతుకూరి విజయ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్ పోస్టు సాధించాడు. ఇటీవల టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీలో రాజనీతి శాస్త్రం, పౌరశాస్త్రం సబ్జెక్టులో విజయ్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. ఎలాటెడ్ కౌన్సెలింగ్‌లో ఆదిలాబాద్ జిల్లా బేల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టింగ్ లభించింది. 2018 టీఎస్పీఎస్సీ ద్వారా టీజీటీ సోషల్ టీచర్‌గా నియమితులైన విజయ్.. 2019లో టీఆర్ఈఐఆర్బీ ద్వారా పీజీటీ సోషల్ ఉద్యోగం సాధించారు. ఇటీవల నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీలో కూడా జూనియర్ లెక్చరర్ పోస్టును విజయ్ సాధించటం గమనార్హం. ఇప్పటికే మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించిన విజయ్.. ఇటీవల టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లో కూడా మెయిన్స్‌కు అర్హత సాధించి ఆ ఫలితాలు కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు విజయ్‌కి అభినందనలు తెలిపారు.

లింగమంతుల ఆలయం వద్ద భక్తుల సందడి



ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న యాదవ కుల పెద్దలు, భక్తులు

అశ్వాపురం: మండల పరిధిలోని రేగులగండి గ్రామంలో లింగమంతుల స్వామి ఆలయం వద్ద మూడు రోజుల పాటు జరిగే శ్రీ భవాని లింగమంతుల జాతర నేపథ్యంలో ఇక్కడ భక్తుల సందడి ప్రారంభమైంది. ఆదివారం శివభవాని రథాలలో జగ్గారం గ్రామం నుంచి యాదవ కుల పెద్దలు, భక్తులు లింగమంతుల స్వామి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నేడు ఉదయం 5 గంటలకు బోనాల ఉత్సవంతో జాతర ప్రధాన కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఉదయం 9.30 గంటలకు భవాని లింగమంతుల స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మద్ది పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శి మంగి మల్లికార్జున్, కమిటీ సభ్యులు, అశ్వాపురం, మణుగూరు మండలాలల యాదవ కుల పెద్దలు, యాదవ సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. మణుగూరు పీవీ కాలనీలో రేగులగండి గ్రామం నుంచి గుట్టపైకి వెళ్తే లింగమంతుల స్వామి ఆలయం వస్తుంది. గుట్టపైకి రహదారి సౌకర్యం ఉంది.

రాహుల్‌పై వ్యాఖ్యలు సరికాదు

అశ్వాపురం: రాహుల్‌గాంధీ కుటుంబంపై బీజేపీ నాయకులు విషం చిమ్మే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహానేతల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీని.. ఆయన కులం ఏంటో తెలవదు అనుకుంటే.. ముందుగా మీ నాయకుడు దేశ ప్రధాని నరేంద్రమోదీని అడగాలన్నారు.

కరకగూడెం: ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించి మతతత్వ రాజకీయాలను బీజేపీ నాయకులు వదిలేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆదివారం ఓ ప్రకటనలో హితవు పలికారు. రాహుల్ గాంధీ కులం ఏమిటి అని అడుగుతున్న వారు ముందు దేశంలో కులగణన చేపట్టి రాహుల్ గాంధీ ఇంటికి వెళ్లి వారి కులం అడగాలని సూచించారు. కులాలపైనా మతాల పైన ఎల్లప్పుడూ రాజకీయాలు చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజలు, అర్చనలు, హోమాలను వేద పండితులచేత శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఈ ప్రతిష్ఠాపన మహోత్సవమునకు హాజరు కాగా.. పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే.. అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వందలాదిగా విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మున్నూరు కాపుల రచ్చబండ

అశ్వారావుపేట: రాష్ట్రంలో ఇటీవల జరిగిన బీసీల కులగణనలో చోటు చేసుకున్న అవకతవకలు, మున్నూరు కాపులకు జరిగిన అన్యాయంపై, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పిలుపు మేరకు మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం అశ్వారావుపేటలోని చిన్నంశెట్టి బజార్‌లో ఉన్న ముత్యాలమ్మ ఆలయం వద్ద, మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కురిశెట్టి నాగబాబు అధ్యక్షతన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో కులగణనలో జరిగిన అవకతవకలపై పలువురు మాట్లాడారు. బీసీ కులగణనలో మున్నూరు కాపులకు జరిగిన అన్యాయం, లోటుపాట్లు తదితర అంశాలపై ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు పాశం రామారావు, పసుపులేటి రామస్వామి, కట్ట శ్రీను, చిక్కం గోపాలకృష్ణ, పవన్, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వేలో బీసీలలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపుల సంఖ్యాబలాన్ని తగ్గించే ప్రయత్నం చేశారని మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు పూదోట సూరిబాబు ఆరోపించారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్నూరు కాపు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. దుమ్ముగూడెం గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ముందుగా గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 సంవత్సరంలో 28 లక్షల జనాభా కలిగి ఉన్నారని లెక్కలు చెప్పగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిని కుదించి 14 లక్షలు ఉన్నట్లు తప్పుల తడకగా కులగనన సర్వే నిర్వహించారని ఆయన ఆరోపించారు. త్వరలో హైదరాబాద్ నడిబొడ్డులో 10 లక్షల మందితో నిర్వహించే భారీ బహిరంగ సభకు మున్నూరు కాపు కుల బంధువులు అత్యధికంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల ఉపాధ్యక్షుడు పత్తివాడ జగదీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొమ్ము బాలకృష్ణ, సంఘం సభ్యులు తుంపెల్లి ఏసురాజు, అల్లాడి వెంకటేశ్వరరావు, కెల్లా వేణుగోపాల్, మందా హరిబాబు, పిల్ల సతీష్, కెల్లా అశోక్, అయ్యప్ప రెడ్డి శ్రీధర్, లంకా ప్రసాద్, కెల్లా పణి కుమార్, కొండపల్లి నవీన్, బైరెడ్డి విశ్వ తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: మున్నూరు కాపుకులస్థుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పోకలగూడెం గ్రామంలో ఆదివారం సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కులగణనలో కాపుల జనాభా సంఖ్యను తగ్గిస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాలని, మున్నూరు కాపుకులస్థుల పిల్లలకు విద్యారంగం ప్రత్యేక రాయితీలు కల్పించాలిని డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు రామిశెట్టి సైదయ్య, నాయకులు వెలగల మధు, లంకా నర్సింహారావు, భోగి కృష్ణ, కృష్ణయ్య, కాశీ, లక్ష్మీపతి పాల్గొన్నారు.



అశ్వారావుపేట: రచ్చబండలో పాల్గొన్న మున్నూరు కాపు సంఘం నాయకులు



చండ్రుగొండ: నినదిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు